క్లుప్తంగా

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదయోగ్యం

• ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: దేశంలోని చట్ట సభలైన పార్లమెంట్, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ ఆమోదం తెలపడం శుభపరిణామమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. లోక్‌సభలో 542 మంది సభ్యులు ఉండగా, అందులో 78 మంది మహిళలు ఉన్నారు. రాజ్యసభలో 244 మంది సభ్యులు ఉండగా అందులో 24 మంది మహిళలు ఉన్నారని చెప్పారు. పార్లమెంట్‌లో ఈ బిల్లు ఆమోదం పొందితే ఇప్పుడున్న సంఖ్య కన్నా మూడు రెట్లు మహిళా ఎంపీలు సంఖ్య పెరుగుతోందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా మహిళా ఎమ్మెల్యేల సంఖ్య భారీగా పెరుగుతోందని చెప్పారు. చట్ట సభల్లో మహిళలు భారీగా పెరగడం వల్ల మెరుగైన ఫలితాలు వస్తాయని ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

మత సామరస్యానికి ప్రతీకగా

• బొజ్జగణపయ్యగా ముస్లిం బాలిక



గణేశ్ వేషధారణలో ఆలియా సజ్మిన్

ఆత్మకూరు: మత సామరస్యానికి ప్రతీకగా ఓ ముస్లిం బాలిక వినాయక చవితి పండగను పురస్కరించుకుని బొజ్జగణపయ్యగా అలంకృతురాలై పలువురిని ఆకట్టుకుంది. పట్టణంలోని లక్ష్మణరావుపల్లికి చెందిన ఆలీయా సజ్మిన్ ఓ ప్రైవేట్ పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. సోమవారం వినాయకచవితి పండగను చిన్న మట్టి ప్రతిమను తీసుకొచ్చి తమ ఇంటిలో పూజ చేయించింది. అనంతరం తనకు గణపతి వేషధారణ చేయాలని తల్లిని కోరడంతో ఆమె సైతం స్వయంగా కుమార్తెకు ఆ అలంకరణ చేసింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు ముస్లిం కుటుంబమైనా మతసామరస్యానికి ప్రతీకగా పూజ నిర్వహించడంతో పాటు గణేష్ వేషధారణ ధరించడంపై సజ్మిన్‌ను మెచ్చుకున్నారు.

24 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ కంటి వైద్య నిపుణులు కె. కోటేశ్వరరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. 24 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. నేత్రవైద్యుడు మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. హెచ్‌ఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు నమోదు చేసుకోండి

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలంలో డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా రాని అర్హులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి నమోదు చేసుకోవాలని ఏఓ శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఆధార్ నంబర్‌ను పొలానికి లింక్ చేసుకోవాలని, పీఎం కిసాన్ ఈకేవైసీ, బ్యాంక్ అకౌంట్‌కు ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలని కోరారు. ఈ ఖరీఫ్ 2023 సీజన్‌లో పంట వేసిన ప్రతి రైతు ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం తరఫున అందే అన్ని వ్యవసాయ పథకాలకు అర్హులవుతారన్నారు. సున్నా వడ్డీ పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీకి ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ చేయించుకుని ఉండాలన్నారు.

పాతాళపల్లి ఎర్ర చెరువు లీజు వేలం

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం పాతాళపల్లి ఎర్ర చెరువులో చేపల పెంపకానికి లీజు వేలం మంగళవారం నిర్వహించారు. పాతాలపల్లి సచివాలయంలో పంచాయతీ అధికారులు వేలం నిర్వహించగా పి.నారాయణ రూ.3,51,000 లీజు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బిజివేముల ఓబుల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఎస్ తిరుపతయ్య, పి పవన్, ఆర్ఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లు సీజ్

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం పల్లిపాడు చెరువులో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ఒక హిటాచి, మూడు టిప్పర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై విశ్వనాథరెడ్డి తెలిపారు. ఇరిగేషన్‌శాఖ ఏఈ యాసిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. చట్ట పరంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

వరికుంటపాడు: మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ చేవూరు శ్రీదేవి హెచ్చరించారు. ఆమె మంగళవారం మండలంలోని రామాపురం, తిమ్మారెడ్డిపల్లె సచివాలయాలను తనిఖీ చేశారు. హుస్సేన్‌నగర్‌లో జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలన్నారు. జగనన్న లేఅవుట్లలో పక్కా గృహాలు మంజూరైన వారు వెంటనే నిర్మాణాలు చేపట్టాలన్నారు. కాలనీలో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు.

జై బోలో గణేశ్ మహారాజ్‌కి జై

పల్లె నుంచి పట్టణం దాకా ఊరు.. వాడా.. వీధి తేడా లేకుండా బొజ్జ గణపయ్యలు కొలువుదీరారు. సోమవారం కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో వినాయక చవితి వేడుకలు భక్తి ప్రపత్తులతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని గణేశ్ ఉత్సవ కమిటీలు విభిన్నంగా మండపాలను తీర్చిదిద్దడమే కాకుండా వివిధ రూపాల్లో గణపతిని కొలువుదీర్చి విశిష్టతను చాటుకున్నారు. కర్జూరం పండ్లతో వినాయకుడు, తండ్రి శివుడి ఒడిలో వినాయకుడు, బాబా రూపంలో వినాయకుడు, టెంకాయల వినాయకుడు, నెమలి వాహనంపై వినాయకుడు, బుజ్జి వినాయకుడు ఇలా వివిధ రూపాలలో విఘ్నేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చాడు. విద్యుత్ దీపాలతో పురవీధులు శోభాయమానంగా రూపుదిద్దుకున్నాయి. ఉట్టి మహోత్సవాలను యువత ఉత్సాహంగా నిర్వహించారు. గణేశ్ మండపాల వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి, అభినవ్‌రెడ్డి బెంగళూరులో ఉదయగిరి వాసులు ఆధ్వర్యంలో జరిగిన చవితి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, కృష్ణ ఘనంగా సన్మానించారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో వినాయక చవితి వేడుకల్లో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కావలి వాయినందప్రెస్ వీధిలోని వినాయకుడి గుడిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం రాత్రి విశేష పూజల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్ వర్క్



ఆత్మకూరు: తోటవీధిలో ప్రధాన వినాయక విగ్రహం ఎదుట బొమ్మల కొలువులా దేవతా విగ్రహాల ఏర్పాటు



కావలి: నాలుగు కాళ్ల మండపం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



కావలి: రూపాయి మిద్దె సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడు



అల్లూరు: వినాయకుడి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న కోనేటిమిట్ట వాసులు



కావలి వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఆత్మకూరు: బ్రాహ్మణవీధిలో వెంకటేశ్వర స్వామి రూపంలో గణేశుడు



కలిగిరి: కృష్ణారెడ్డిపాలెంలో విశేష అలంకరణలో వినాయకుడు



ఆత్మకూరు: తోటవీధిలో కొలువుదీరిన గణేశుడు



ఆత్మకూరు: ఉట్టి మహోత్సవంలో యువత సందడి



ఆత్మకూరురూరల్: విశేష అలంకరణలో దీసీపల్లిలోని శ్రీపంచముఖశక్తి గణపతి



ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న చిన్నారులు, యువకులు



సంగం: శివాజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



బ్రాహ్మణపల్లిలో చవితి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



కొండాపురం: కొమ్మి బీసీ కాలనీలో ప్రత్యేక అలంకరణలో ఉన్న వినాయకుడు



దుత్తలూరు: రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం



ఉదయగిరి: మేకపాటి రాజారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

మా ప్రభుత్వంలోనే అభివృద్ధి

• ఎంపీపీ సంపూర్ణమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ

చేజర్ల (సోమశిల): సంక్షేమం, అభివృద్ధితో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి తమ ప్రభుత్వంలోనే సాధించినట్లు అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ తెలిపారు. మంగళవారం ఎంపీపీ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. అమ్మఒడి, మహిళలకు ఆసరా, నేతన్న నేస్తం, నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి, జగనన్న గృహాలు తదితర పథకాలను ప్రవేశ పెట్టి పేద ప్రజల మన్ననలు పొందారన్నారు. గ్రామ స్థాయి పరిపాలన తీసుకు వచ్చి రాష్ట్రాన్ని అభి వృద్ధి చేస్తున్నారని, ప్రజలందరూ మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకొంటున్నారన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడి నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటించి పేద ప్రజల సమస్యను తెలుసుకుని వాటిని పరిష్కరించారన్నారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరంను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆత్మకూరులో జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి వివిధ కంపెనీల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం మండల సొసైటీ అధ్యక్షుడు కేతా రామకృష్ణారెడ్డి, అనంతసాగరం సర్పంచ్ కమతం శోభ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సొందల్‌మాలి



క్యూలైన్లలో మహిళా భక్తులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రధాన పుణ్యక్షేత్రం హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో సోమవారం రాత్రి దొరసానమ్మ సొందల్ మాలి వైభవంగా నిర్వహించారు. కొద్ది రోజుల్లో దొరసానమ్మ గంధమహోత్సవం ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళలకు మొదటి సారి దర్గాలోకి ప్రవేశం కలిప్తారు. దొరసానమ్మ గంధమహోత్సవం మొదలైన సందర్భంలో ఏడాదికి ఒకసారి మాత్రం మహిళలను లోనికి అనుమతి ఇస్తే అమ్మ వారికి సమాధికి గంధం లేపనం చేసి మహిళలు మొక్కులు తీర్చుకుంటారు. ఆ తర్వాత మహిళలకు దర్గాలోని సమాధుల వద్దకు ప్రవేశం ఉండదు. సంప్రదాయబద్ధంగా అమ్మవారి సమాధిని మొదట పీఠాధిపతి, వారి బంధువులు గంధాన్ని లేపనం చేస్తారు. అనంతరం మహిళా భక్తులను లోనికి అనుమతిస్తారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో దర్గా ఈఓ హుస్సేన్ క్యూలైన్ల కోసం బారికేడ్లను ఏర్పాటు చేయించారు. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. సంగం సీఐ రవినాయక్, ఏఎస్‌పేట ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో 50 మంది మహిళా పోలీసులను ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేశారు. ఈ నెల 23 నుంచి చిన్నగంధం ప్రారంభం కానున్నట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



షుగర్ పరీక్ష చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అల్లూరు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నీలం సాయికుమార్ అన్నారు. మంగళవారం అల్లూరు–1 సచివాలయ పరిధిలోని ఆర్‌డీఆర్ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించి వారి పరిస్థితిని నిరంతరం సమగ్రంగా పర్యవేక్షించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మొదలు పెట్టిందన్నారు. అనారోగ్యంతో ఉన్న ప్రజలను గుర్తించి సంబంధిత వివరాలతో ప్రత్యేకంగా కేస్ షీట్లు తయారు చేస్తారన్నారు. సర్వేలో ఆరోగ్య కార్యకర్త, కమ్యూనిటీ హెల్త్ అధికారి సంయుక్తంగా ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబంలో ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం–1 కన్వీనర్ బత్తల సుధాకర్, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, వీఆర్వో రంతుల్లా, ఏఎన్‌ఎంలు ప్రమీలా, రమమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న ఓబులరెడ్డి

ఉదయగిరి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నేత జీ ఓబులరెడ్డి అన్నారు. మండలంలోని దాసరిపల్లిలో మంగళవారం గృహసారథులు, వలంటీ ర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి ఇల్లు ఒకటికి పది సార్లు పరిశీలించి ప్రభుత్వ పరంగా వారికి అందాల్సిన లబ్ధి అందేలా చర్యలు తీసుకావాలన్నారు. సాంకేతిక సమస్యలతో ఎవరికైనా పథకాలు అందకపోతే తమ దృష్టికి తీవాలని సూచించారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా ప్రతి కుటుంబానికి వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించే విధంగా ప్రజలను సమాయత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సూభానీ, సర్పంచ్ గౌస్‌మొయిద్దీన్, జేసీఎస్ కన్వీనర్ మండల కే కృష్ణారెడ్డి, నేతలు నారపరెడ్డి, సుబ్బయ్య, రమణ తదితరులు ఉన్నారు.

ఈ నెల 29న పీకేపాడు చెరువు లీజు వేలం

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని పడమటికంభంపాడు ఎర్ర చెరువులో చేపల పెంపకానికి లీజు వేలం ఈ నెల 29వ తేదీ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కే నరేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.3.50 లక్షలు నిర్ణయించామన్నారు. పాటలో పాల్గొనే ఆసక్తి ఉన్న రూ.1.75 లక్షలు డిపాజిట్ రుసుం చెల్లించి పాల్గొనాలని కోరారు.

లారీపై ఆకతాయిల దాడి

• క్లీనర్‌కు గాయాలు

సంగం: మండలంలోని పెరమన వద్ద నెల్లూ రు–ముంబయి జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ లారీపై ఆకతాయిలు రాళ్లతో దాడి చేసిన ఘ టన మంగళవారం ఉదయం జరిగింది. క్లీనర్ మధుకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. బద్వేల్ వైపు నుంచి మొక్కజొన్న పొట్టు లోడును కోడూరు వద్ద ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ మండలంలోని పెరమన వద్దకు వచ్చే సరికి రెండు బైక్‌ల్లో నలుగురు యువకులు మద్యం మత్తులో వెళ్తూ లారీ పైకి రాళ్లు విసిరారు. దీంతో లారీ డ్రైవ్ చేస్తున్న మధుకృష్ణ తలకు తీవ్ర గాయమైంది. భయాందోళనకు గురైౖ అతను లారీని ఆపకుండా వేగంగా బుచ్చిరెడ్డిపాళెంకు వెళ్లి అక్కడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందారు. సమాచారం అందడంతో సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణేశ్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఎస్‌ఐ సుమన్

కావలి: వినాయక చవితి ఉత్సవాల్లో గణేశ్ నిమజ్జనానికి కావలి సముద్ర తీరంలో మూడు చోట్ల ఏర్పాట్లు ప్రత్యేక చేసినట్లు రూరల్ ఎస్సై శెట్టిపల్లి సుమన్ చెప్పారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాళెం పట్టపుపాళెం తీరంలో నిమజ్జనానికి ప్రభుత్వ శాఖల సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. తీరంలో బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు 50 మంది పోలీసులు విధుల్లో ఉంటారని తెలిపారు. మత్స్యశాఖ సహకారంతో 30 మంది గజ ఈతగాళ్లు లైఫ్ జాకెట్లతో అప్రమత్తంగా ఉంటారన్నారు. వైద్య సిబ్బంది, రెవెన్యూ శాఖలు కూడా నిమజ్జనంలో భాగస్వామ్యం అయి భక్తులకు, ప్రజలకు ఆటంకాలు లేకుండా ఉండేలా విధులు నిర్వర్తించనున్నట్లు వివరించారు. షామియానాలు వేసి, మైక్ అనౌన్స్‌మెంట్, లైట్లు సమకూర్చి భక్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తామని చెప్పారు. నిమజ్జనానికి తీరానికి తరలి వచ్చే భక్తులు కావలి–తుమ్మలపెంట రోడ్డు మార్గంలో అతివేగం, విచ్చలవిడిగా వాహనాలు నడపడం వంటి చర్యలకు పాల్పడి ఇతరలను ఇబ్బందులకు గురి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. సముద్రతీరంలో అనుమతించిన వరకే నీటిలోకి వెళ్లాలని, అక్కడ ఉండే గజ ఈతగాళ్లకు సహకరించాలని కోరారు.

చెరువు వద్ద నిమజ్జనం..

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం ఊరేగింపులు ప్రశాంతంగా నిర్వహించాలని, అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కె.ముత్యాలరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో సుమారు 40 విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడో రోజు బుధవారం నుంచి వినాయక విగ్రహాల నిమజ్జనం ఉంటుందని, ఆయా మండపాల నిర్వాహకులు నిమజ్జనం ఊరేగింపు పోలీసులు నిర్ణయించిన మార్గాల్లోనే సాగాలని తెలిపారు. నిమజ్జనం కోసం ఆత్మకూరు చెరువు వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ బి.నాగేశ్వరరావు తెలిపారు. నిబంధనల మేరకు విగ్రహాల నిమజ్జనం సమయంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా కొద్ది మంది మాత్రమే చెరువు వద్ద ఉండాలన్నారు. వినాయక నిమజ్జనం బుధవారం మధ్యాహ్నం జరగనున్న క్రమంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నిమజ్జనోత్సవం పూర్తయిన అనంతరం సరఫరా పునరుద్ధరించనున్నట్లు డీఈఈ జనార్దన్ తెలిపారు.

అమ్మ చేతి గోరుముద్ద

ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. పోషకాలతో కూడిన ఆహారం తీసుకున్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా చదువులోనూ రాణిస్తారు. ఆ ఉద్దేశంతోనే ప్రభుత్వం రోజుకో మెనూతో జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోంది. రుచికరమైన ఆహారంతో పాటు రాగిజావను కూడా అందిస్తోంది. దీంతో విద్యార్థులు ఇష్టంగా మధ్యాహ్న భోజనాన్ని ఆరగిస్తున్నారు.

- ప్రభుత్వ స్కూళ్లో రుచికరమైన భోజనం
- అదనంగా రాగిజావ
- ఇష్టంగా తింటున్న విద్యార్థులు



మాముడూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

చేజర్ల: మండలంలో మొత్తం 59 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో మొత్తం 3,203 మంది విద్యార్థులు చదువుతుండగా, 109 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. సుమారు 2,700 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నాసిరకమైన వంటకాలతో అరకొరగా మధ్యాహ్న భోజనం పెట్టే పరిస్థితి. ఆ భోజనంపై విద్యార్థులు అంత ఆసక్తిని చూపని దుస్థితి. ఇప్పుడు ఈ పరిస్థితులు మారాయి. ఎప్పటికప్పుడు విద్యా కమిటీల అభిప్రాయాలను విద్యాశాఖ సేకరిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులు సాంబారు అన్నాన్ని ఇష్టంగా తినకపోవడంతో మెనూలో నిమ్మకాయ పులిహోరను చేర్చారు. పాఠశాలలో రోజూ ఉపాధ్యాయుడు వెళ్లి పదార్థాలను పరిశీలించిన తర్వాతనే విద్యార్థులకు భోజనాన్ని అందించడం విశేషం. గతంలో వంట ఏజెన్సీల నిర్వాహకులు నెలకు మూడు సార్లు కొడిగుడ్లు సరఫరా చేసేవారు. గుడ్లు కొన్న చోట్ల చెడిపోయేవి. విద్యార్థులు తినేందుకు ఇబ్బంది పడేవారు. ఇది గమనించిన ప్రభుత్వం నెలకు నాలుగు సార్లు గుడ్లు సరఫరా చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఏ వారంలో సరఫరా అయినా గుడ్డును అదే వారంలో వినియోగించేలా గుర్తులు వేస్తున్నారు. విద్యార్థులకు 5 గుడ్లను ప్రభుత్వం అందిస్తోంది. ఇలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకొంటున్న నేపథ్యంలో పాఠశాలలో భోజనం చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు చెబుతున్నారు.

మెనూ

- **సోమవారం :** హాట్ పొంగలి, ఉడికించిన గుడ్డు, కూరగాయల పలావ్, చిక్కీ
- **మంగళవారం:** పులిహోర, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగి జావ
- **బుధవారం:** వెజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- **గురువారం:** నిమ్మకాయ పులిహోర, ఉడికించిన గుడ్డు, రాగిజావ
- **శుక్రవారం:** ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- **శనివారం:** తీపి పొంగల్, పప్పు, రసం, రాగి జావ

భోజనం రుచిగా ఉంటోంది



నేను రోజూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నాను. వారానికి 5 కోడి గుడ్లు ఇస్తారు. రోజుకో రకం వెరైటీ భోజనం పెడుతున్నారు. భోజనం చాలా రుచిగా ఉంటోంది. ఇంట్లో కన్నా పాఠశాలలోనే బాగుంటుంది. ప్రభుత్వం అందించే రాగిజావ ఎంతో రుచికరంగా ఉంటోంది.

– జి గీతిక, 10వ తరగతి, మాముడూరు జెడ్పీహెచ్‌ఎస్

విద్యార్థులు అందరూ తింటున్నారు



గతంలో మధ్యాహ్న భోజనం సరిగా తినేవాళ్ల కాదు. ఇప్పుడు చాలా రుచిగా ఉండడంతో రోజూ పాఠశాలలోనే తింటున్నాం. ఇంట్లో భోజనం ఎలా ఉంటుందో స్కూళ్లో అలానే ఉంటుందోంది. రోజుకో ఉపాధ్యాయుడు భోజనం పరిశీలించి మాకు అందజేస్తారు.

– మహిధర్, 8వ తరగతి, మాముడూరు జెడ్పీహెచ్‌ఎస్

ఇష్టంగా తింటున్నారు



రోజూ మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించే బాధ్యతను ఒక టీచర్‌కు అప్పగిస్తున్నాం. ఆ టీచర్ దగ్గరుండి అన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నాం. గతంలో విద్యార్థులు ఇంటి నుంచి భోజనం బాక్సులు తెచ్చుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– వై శ్రీనివాసులు హెడ్ మాస్టర్ మాముడూరు జెడ్పీహెచ్‌ఎస్